# ప్రేమశక్తి

శ్రీ వై. రామమూర్తిగారు

అది సాయంత్రము. వృద్ధుడొకడు గమనాయాసముతో మెల్లగ అడుగులిడుచుండెను. అతని వెనుక కొంతదూరమున ఒక యువతి వచ్చుచుండెను. అతడదియెఱుగును. కాని నిల్చి మాట్లాడలేదు. ఆయువతి కల విరియపోసికొని వెలవెల పాటుచూపులతో తత్తరపాటుజెందు హృదయముతో ముసలివానిచేర కాళ్లు తడబడ నడకను సాగించుచుండెను. వారిరువురును నిశ్శబ్దముగ కొంతసేపు ప్రయాణించిరి. సూర్యుడు అస్తమించెను. చీకటి గ్రమ్ముచుండెను.

ఆయువతి వృద్ధుని ఒక గృహద్వారముకడ ఆపి, గద్గదస్వరముతో "అయ్యా! అదో ఆనల్లని గోడలను చూచారా? అవి నాచుతో కప్పబడిన పురాతనపు గోడలు. ఆగోడలమధ్య ఒక కారాగృహము ఉంది. అందు నేను వరించిన యువకుడున్నాడు. మీరు ప్రతిదినమును గంట వాయిస్తున్నారు గదా? ఈ రాత్రి గంటమ్రోత వినబడగానే అతణ్ణి అచ్చట ఉరిదీయవలెనని న్యాయాధికారులు అతనికి ఘోరశిక్షను విధించిరి. కాబట్టి అతనికి సహాయముచేసి ప్రాణమును కాపాడువారు ప్రపంచమునందు ఎవరూ కనబడలేదు. నేను మిమ్మల్ని ఒక్కటి ప్రార్థిస్తున్నా. మన ప్రభువు విల్లియమ్ అర్ధరాత్రివరకు ఇక్కడికిరారు. వారి భయము మీ కేమాత్రము వద్దు. మీరు ఈ రాత్రి గంట వాయించకుండా వుండండి." ఆమె వణకుచున్నను మెల్లని పెదవులతో అస్ఫుటముగా వృద్ధుని బ్రతిమాలెను.

ఆవృద్ధుడామెతో "అమ్మాయీ! నేను చిరకాలమునుండీ అంధకారంలో వుండే గంటను మ్రోగిస్తూ నావిధి సక్రమముగ చెల్లిస్తున్నాను. ఇప్పుడుకూడా అట్లే తప్పక జరిగితీరవలసివున్నది. ఇన్నాళ్లవరకూ నా విధియందు ఎటువంటిలోపమూ జేయనట్టి వాడను నేను. నేను ఇట్టి అక్రమకార్యము చేయను. ఆగంట ఎప్పటివలెనే మ్రోగిస్తాను" అనెను. ఆమాటలామె వీనులకు ములుకులవలె తోచెను. ఆమె వివర్ణవదనయై అట్లే నిలువబడి వింతగా వృద్ధునివంక చూచుచుండెను. నిష్ఠురులైన న్యాయాధ్యక్షులిచ్చిన తీర్పు, కొంతకాలములో తన హృదయేశ్వరునకు కలుగబోవు దారుణమరణము ఆమె హృదయమున గోచరించెను. ఆమె దీర్ఘనిశ్వాసములు బుచ్చి, మతి స్థిరపరచుకొని తనలో స్పష్టముగ "గంటమ్రోగకుండుగాక" అని పలుకుచు ముసలివానివైపు తిరిగి "తాతా! ఆలాఅయితే నేను వెళతా" అని చెప్పి ఒక్కపరుగున పరుగెత్తిపోయెను. ఆమె సాహసించి ఏమిచేయునోయని ఆలోచించుచు వృద్ధుడు అచ్చటనే నిశ్చేష్టు

డయి ఆమె పరుగిడిపోయిన దిక్కునకల్లే చూచుచు నిలిచియుండెను.

యువతి త్వరగా గంట వ్రేలాడుచున్న స్థలమునకు వెళ్లుచుండెను. ఆగంట ఒక ఉన్నతగోపురమున బంధింపబడియున్నది. గంటవద్దకు వెళ్లవలెనన్న అంధకారబంధుర మగు మెలికలు తిరిగియున్న మెట్లుద్వారా వెళ్లవలయును. ఆమెట్లు నిచ్చెనమెట్లుకన్నను సన్నగిల్లియున్నవి. అయినను ఆమె ఏ మాత్రము జడియక ఆవణకుచున్న పెదవులతో తనలోతాను "గంట మ్రోగకుండుగాక" అను పూర్వోక్తవాక్యమును ఉచ్చరించుచు ఆ చీకటిగదిని సమీపించెను. ఆమె తడబడునడుగులతో మెట్లెక్క మొదలిడెను. ఆమె చేతిపట్టువదలక వెనుకకు తిరిగిచూడక ఆదారిపైకి వెళ్లుచుండెను. కొంతసేపటికామె గంట నందుకొనగల్గెను. ఆమె అచ్చటాగెను. ఆచీకటికోణములో తేరిపారజూచెను. అందు కంచుగంట వ్రేలాడ కట్టబడియున్నది. అది పాతాళలోకములోనున్నట్లు కనుపించెను. ఆమె కన్నులకు చీకట్లు క్రమ్మెను. గుండెఝల్లుమనెను. అయినను హృదయేశ్వరునెడగల ప్రేమ అమితశక్తి నొసగెను. ఆమెకు దడమాని ధైర్యముకలిగెను. పట్టువదలక తనప్రయత్నమును కొనసాగింప నిశ్చయించుకొనెను. తక్షణమే ఆమె ఇంచుకపైకెగిరి గంటమధ్యనుండు అయోమయగోళమును గట్టిగా తన రెండు హస్తములతో పట్టుకొని వ్రేలాడెను. వెంటనేగంటయు, ఆయువతియు ఒక్కఊఊపూగిరి. ఆఊపులో, ఆమెకానగరమంతయు, ఆకాశమడుగంటునా యున్నట్లు, మిణుకుమిణుకుమనెడి నక్షత్రములవలెఁబోలు దీపకాంతులతో కనబడెను. కొంతసేపువరకు ఊగి, ఆమె యా గంటనుబట్టి అల్లే వ్రేలాడుచుండెను. వృద్ధుడు యువతివెళ్లిన కొంతసేపటివరకు అచ్చటనే నిలువబడి తన నిత్యకృత్యమును నెఱవేర్చుటకు నెమ్మదిగ గంటవద్దకు వచ్చుచు "పాపము ఆఅమ్మాయి భర్తను పోగొట్టుకొనక తప్పదు. నేను నాధర్మాన్ని ఎప్పటిలాగే నెఱవేర్చకమానను. పరమేశ్వరుని ఆజ్ఞ అయిపోయినది. నేను జాలిపడితే మాత్రము లాభమేముంది?" అని తనలో తాననుకొనుచు గంటగోపురద్వారము కడకు వచ్చి నిలచెను. కొంతసేపటికి గంట నిర్ణయకాలమయినదని తెలుసుకొనెను. మెల్లగా "అయ్యో! యెంతపాపము చేయవలసి వచ్చెను" అనుచు గంట త్రాడుబట్టి గట్టిగా లాగుచుండెను. అతడు బధిరుడు. ఆగంట మ్రోగునదియు లేనిదియు అతనికి తెలియక పోయెను. గంట నడుమనుండు ఇనుపగుండునుబట్టి ఆమె వ్రేలాడుచుండుటవలన గంట ధ్వనింపలేదు. కాని ముసలివాడు త్రాడును లాగినప్పుడు ఆగంటతో యువతియు గిరగిర తిరుగుచు కొట్టుకొనుచుండెను. కొంతసేపట్లు కొట్టుకొన్నపిమ్మట గంటఊగుట మానెను. తనపని ముగిసెనని వృద్ధుడు త్రాడును విడచిపెట్టి ఇంటికి వెళ్లిపోయెను. తనపనియు ముగిసెనని వనితయు గంట ఇనుపగోళమునువిడిచి మెట్లుదిగి క్రిందికి

వచ్చెను. ఆ స్థలమంతయు నిర్మానుష్యము కారు చీకటి. ఆమెకు చేతులలో ఒకవిధమైన బరువుతోచెను. పరిశీలించి చూచుకొనగా అనేకచోట్ల నవి చితికియుండెను. రక్తము కారుచుండెను. ఓర్పుతో పట్టుదలతో పనిచేయునప్పుడే బాధయు తోచలేదు. కాని తరువాత ఆగాయములామెను పీడింపజొచ్చెను.

రెండుచేతుల నెత్తిని తుడుచుకొనుచు నామె మెల్లమెల్లగా నడచిత్రోవనుచేరి రాచబాటలో ప్రవేశించి నడచుచుండెను. ప్రతిదినము ప్రొద్దుగ్రుంకినతోడనే, దైవనిర్ణయము వంటి తనయాజ్ఞననుసరించి మ్రోగుచుండు గంటఆనాడు మ్రోగకుండుటవిని, ఆందోళనమనస్కులవాడై విల్లియమ్ ప్రభువు, ఆదారిని పాదచారియై వచ్చుచుండెను. అతనిని జూచి, యువతిగుర్తెరిగి, చెదరినగుండెను కుదుటపరచుకొని, ఆతని పాదములపై బడెను. తోడనే విల్లియమ్ ఆశ్చర్యముతో ఆమెనుపైకి లేవనెత్తి, "అమ్మాయీ! నీవెవతెవు? నీవేలయీచోట తిరుగుచున్నావు?" అనిఅడిగెను. యువతిమాటాడలేక వెక్కివెక్కియేడ్చుచుండెను. ప్రభువు, "తల్లీ! దుఃఖించవద్దు" అనిఓదార్చెను. యువతినోటమాటరాకతనరెండుచేతులనువారికిచూపి, ఊరకయేడ్చుచుండెను. తుదకు జరిగినదంతయు తెలుసుకొని, "అమ్మా! నీపతిప్రేమకు నాకు చాలాసంతోషం కలుగుతూంది. నీభర్తను క్షమిస్తాను" అని, తనజేబునుండి ఒకకాగితమునుదీసి తేడుక్షమాపత్రమును వ్రాసియిచ్చెను. ఆమె అది మహాప్రసాదమని అందుకొని, తనకృతజ్ఞతా సూచకముగా ఆతని అడుగులనుబడి, యశ్రువారి అర్ఘ్యపాద్యములిచ్చి సెలవుపుచ్చుకొని, త్వరితగతినేగెను. ఆమెక్షమాపత్రము పొందియున్నను కాలముమీరుటచే ప్రియుని ఉరిదీసిరేమోయని చింతనొందెను. మరింతశీఘ్రముగా కారాగృహమువైపు పరుగిడెను. రాజభటులు, ఒకసుందరుని సంకెళ్లతో కారాగారామునుండి, ఉరికంబమువైపునకు తీసుకొనివచ్చుచుండిరి. యువతి వారినిజూచినది. ఆమె హృదయేశునకెదురేగి ఆతని పాదములపై బడెను. ప్రియుడామె నెత్తిఓదార్చెను. "నాభర్తను విడవండి" అని తనచేతిలోనున్న క్షమాపత్రమును వారికిచ్చెను. ఆమెభర్త హస్తములను పట్టినిలచెను. భటులందరు నిశ్చేష్టులయిరి. ఆనిందితుని చేతిసంకెళ్లను ఊడదీసిరి.

"ప్రాణప్రియా! నాకు ప్రాణదానముచేసితివా?" అని పురుషుడామెను హృదయమునకు హత్తుకొనెను.